క్లుప్తంగా

శ్రీవారికి గులాబీ పుష్పార్చన



అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామివారికి శనివారం పసుపు వర్ణ గులాబీలతో పుష్పార్చన చేశారు. ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతో ఆరోగ్యం, ఆహ్లాదం

అగనంపూడి: స్వచ్ఛ పరిసరాలతో ఆరోగ్యంతో పాటు ఆహ్లాదం ఉంటుందని జీవీఎంసీ గాజువాక ఏసీపీ మహాపాత్రో అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతకు ఎంత ప్రాధాన్యమిస్తున్నారో, పరిసరాల పరిశుభ్రతకూ అంతే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఎన్ఎస్ఎస్ పీవో సుందరరామమ్ తదితరులు పాల్గొన్నారు.

11న 'చలో అడ్మిన్'

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల ప్రత్యేక అలవెన్సుల సమస్య పరిష్కరించకపోతే ఈ నెల 11న చలో అడ్మిన్ కార్యక్రమం చేపడతామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. ఉక్కునగరంలో శనివారం నిర్వహించిన కార్మిక సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గత నెల 13న జరిగిన ఈడీ (వర్క్స్) ధర్నాలో వారంరోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. జి.శ్రీనివాసరావు, బొడ్డ గోవింద, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమగ్రాభివృద్ధి లక్ష్యం

- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి
- 76వ వార్డులో రూ 2.75 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: విశాఖ నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. గ్రేటర్ పరిధిలోని అన్ని వార్డుల్లో వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 76వ వార్డులోని హౌసింగ్‌బోర్డు కాలనీ, పెద నడుపూరు, డెయిరీ కాలనీ ప్రాంతాల్లో పార్కులు, కాలువలు, రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలసి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సమష్టిగా పని చేస్తున్నామన్నారు. రూ.180.22 లక్షలతో హౌసింగ్ బోర్డు కాలనీలో పార్కు ప్రహరీ గోడ నిర్మాణం, పార్కు రోడ్డుకు సమానంగా ఎత్తు చేయడం, కాలువలు నిర్మించడం అలాగే నడుపూరులో 77.95లక్షలతో కాలువలు, రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. డెయిరీ కాలనీలోరూ.16.60 లక్షలతో పార్కు ప్రహరీ కడుతున్నామన్నారు. ఎక్కడ ఏ సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో అన్ని వార్డులు అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, నాయకులు మంత్రి శంకరనారాయణ, టి.జగదీష్, పి. ప్రమీల, నరసింహమూర్తి, బి.అప్పారావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కాంట్రాక్ట్ కార్మికుడు మృతి

కూర్మన్నపాలెం : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుడు, చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఘటనకు సంబంధించి దువ్వాడ శాంతి భద్రతల సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. అగనంపూడి దిబ్బపాలెం ప్రాంతానికి చెందిన గొల్లవిల్లి అప్పారావు (47) స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తూ భార్య రమణమ్మతో కలిసి నివసిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏ షిఫ్ట్ ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా శనివాడ జంక్షన్ వద్ద గాజువాక నుంచి స్కూటీపై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయన్ను అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం అర్ధరాత్రి చెవి నుంచి రక్తస్రావం కావడంతో, వెంటనే మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాసరావు (ఫైల్)

పెదగంట్యాడ: మండలంలోని సీతానగరం ఎస్సీ కాలనీలో శనివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్టుపూడి శ్రీనివాసరావు (41) సీతానగరం ఎస్సీ కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసై, రోజూ డబ్బులు ఇవ్వాలని భార్యను వేధించేవాడు. శనివారం కూడా డబ్బులు ఇవ్వాలని భార్య లక్ష్మితో, తల్లితో గొడవపడిన శ్రీనివాసరావు తర్వాత ఇంట్లోకి వెళ్లిపోయాడు. అందరూ నిద్రపోయాడనుకున్నారు. తర్వాత కిటికీలోంచి చూడగా దుస్తులు ఆరవేసుకునే తాడుతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే అతని భార్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతడిని కిందికి దించి, 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించే సరికే ఆయన మృతి చెందాడు. మృతునికి తల్లి, భార్య, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిపాలు అమృతతుల్యం



తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

అక్కిరెడ్డిపాలెం: నవజాత శిశువుకు తల్లిపాలు అమృతతుల్యమని షీలానగర్‌లోని నర్సింగ్ స్కూల్ విద్యార్థినులు గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పిల్లలు పుట్టిన దగ్గర నుంచి 6 నెలల వరకు తల్లిపాలు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ నెల 1న ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు 8వ తేదీ వరకు కొనసాగుతాయని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ దుర్గాబాయి, సచివాలయాల మహిళా పోలీసులు వి.పూర్ణిమ, జి.గాయత్రి, మనీషా స్కూల్ ఆఫ్ నర్సింగ్ వైస్ ప్రిన్సిపాల్ అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెదగంట్యాడ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 77వ వార్డు పెదపాలెం, చినపాలెం, ఆశిష్ నగర్‌లో శనివారం ఆయన పర్యటించారు. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారితో కలిసి ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులను కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.

905వ రోజుకు ఉక్కు రిలేదీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 905వ రోజుకు చేరుకున్నారు. దీక్షల్లో బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు పాల్గొన్నారు.

మాతాశిశువుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న చందు



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం



గర్భిణికి పౌష్టికాహారం అందిస్తున్న జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్

గాజువాక: మాతా శిశువుల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా నియోజకవర్గంలోని పలు వార్డుల్లో గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్‌ను అందించారు.

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను 66వ వార్డు అంగన్ వాడీ కేంద్రంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ పంపిణీ చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహి క సీమంతం నిర్వహించారు. కార్పొరేటర్ ఇమ్రాన్ చేతుల మీదుగా చీర, జాకెట్, పండ్లు, స్వీట్లు అందజేసి సత్కరించారు.
- 70వ వార్డు డ్రైవర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్‌ను కార్పొరేటర్ ఉరుకూటి చందు పంపిణీ చేశారు.

అగనంపూడి: గర్భిణులు బాలింతల సంపూర్ణ ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ ఇల్లపు ప్రసాద్ అన్నారు. సంపూర్ణ పోషణ పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని, వారికి కిట్లు అందించారు.

గాజువాక : పాతకర్ణవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను 72వ వార్డు కార్పొరేటర్ స్టాలిన్, బీజేపీ గాజువాక కన్వీనర్ కె.నర్సింగరావు అందించారు.

పెదగంట్యాడ: 75వ వార్డు రెడ్డి ముసలినాయుడుపాలెం, దుర్గవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, భారతి తదితరులు పాల్గొన్నారు.

9న 'క్విట్ మోదీ..సేవ్ వైజాగ్ స్టీల్'

ఉక్కునగరం: క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈ నెల 9న 'క్విట్ మోదీ – సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట నిర్వహిస్తున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. శనివారం నిర్వహించిన స్టీల్ సీఐటీయూ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను, ప్రభుత్వ రంగ పరిశ్రమల భవిష్యత్తును నిర్వీర్యం చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు 'క్విట్ మోదీ..సేవ్ ఇండియా' అన్న నినాదాన్ని ఇచ్చాయన్నారు. అందులో భాగంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ 'సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ,వై.టి. దాస్, పుల్లారావు, మొహిద్దీన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు మెరుగైన చట్టాలు అవసరం

గాజువాక : దేశంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అత్తిలి విమల అన్నారు. గాజువాకలో శనివారం నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ దాడులను అడ్డుకోవడం కోసం మహిళలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మహిళలకు రక్షణగా పాలకపక్షాలు మెరుగైన చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సమావేశం అనంతరం మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలుగా పిల్లా సూర్యపద్మ, ప్రధాన కార్యదర్శిగా కె.వనజాక్షి తదితరులను ఎన్నుకున్నారు.